క్లుప్తంగా

అమ్మవారి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న చైర్మన్ ఈశ్వరరావు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి 48వ వార్షిక నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 22 నుంచి 30వ తేదీ దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పాతటప్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, కమిటీ సభ్యులు, అర్చకులు సోమవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. అమ్మవారి మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోరారు. వైఎస్సార్‌సీపీ సవిరిగాన ప్రదీప్, టి.సుధాకర్, ఎం.వరదరాజు, ఎస్.కృష్ణారావు, పి.తిరుపతిరావు, అర్చకులు సంతోష్ ఉన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



సైబర్ మోసాల గురించి వివరిస్తున్న కళాజాత బృందం

ఆమదాలవలస రూరల్: బ్యాంకు ఖాతాదారులు ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ సీఎఫ్ఎల్ సిబ్బంది చిగురుపల్లి వెంకటేష్ తెలిపారు. మండలంలో పొన్నాంపేట గ్రామంలో సైబర్ మోసాలపై కళాజాత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాలు తెలియజేయడానికి టోల్ ఫ్రీ నంబర్ 1930, రిజర్వ్‌బ్యాంక్ ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ టోల్ ఫ్రీ నంబర్ 14448కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. బ్యాంకు ఖాతాదారులు వ్యక్తిగత వివరాలను తెలియజేయవద్దన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ సంధ్యారాణి, కళాజాత బృందం సభ్యులు కె.శంకరరావు, కె.కృష్ణారావు, ఎం.లక్ష్మి, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

ఆధునికీకరణ పనులు చేపట్టాలి



దేశాయి చానల్‌ను పరిశీలిస్తున్న అప్పలనాయుడు

బూర్జ: మండలంలోని దేశాయి చానల్‌లో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు తొలగించి ఆధునికీకరణ పనులు చేపట్టాలని రైతు సంఘ జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. దేశాయి చానల్‌ను సోమవారం పరిశీలించారు. పూడికపోయిన మట్టి తొలగించి మండలంలోని అల్లెన, వైపర్త, లక్కుపురం గ్రామాలకు సాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉంటే నష్టాలు నివారించవచ్చునని ఆమదాలవలస ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ కె.అప్పారావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా స్థానిక వెంకటసాయి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విన్యాసాలు ప్రదర్శించి విద్యార్థులకు స్వయంగా చూపించారు. కళాశాల కరస్పాండెంట్ కూన జగన్నాథం, ప్రిన్సిపాల్ బెండి పురుషోత్తమరావు, అధ్యాపకులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

జన సురక్ష పథకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్రాంచ్ మేనేజర్ కిరణ్‌కుమార్

బూర్జ: జన సురక్ష పథకం ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏపీ గ్రామీణ వికాస బ్యాంకు బూర్జ శాఖ ఆధ్వర్యంలో పెదలంకాం గ్రామంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ సి.హెచ్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీ బ్యాంక్ ఖాతాదారుడు ప్రధాన మంత్రి సురక్ష బీమా, జీవన్ జ్యోతి పథకంలో నమోదు కావాలన్నారు. తద్వారా ఎవరైనా ప్రమాదానికి గురైన, సాధారణ మరణం చెందిన వారికి రూ.2 లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. గ్రామస్తులు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.



నరసన్నపేట: మండల కేంద్రంలోని నాయుడువీధిలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: చంద్రయ్యపేటలో సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేస్తున్న వైస్ ఎంపీపీ శోభారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస రూరల్: వంజంగిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్ బెండి సత్యవతి

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



బూర్జ: ఓ.వి.పేటలో స్టిక్కర్లు అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. జగనన్న సిక్టర్లను అతికించారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: అడ్డంగి పంచాయతీ దిగువముల్లెల గూడలో వంట చేస్తున్న గిరిజన మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సరుబుజ్జిలి: రావివలసలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సారవకోట: చీడిపూడిలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హిరమండలం: హిరమండలంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



లక్కుపురంలో లబ్ధిదారుకి అభివాదం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: కులం, మతం, ప్రాంతం, జెండా చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘన చరిత్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని పాలవలస సచివాలయం పరిధిలో లక్కుపురం, పనుకపర్త గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించి లబ్ధిదారులకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. రూ.63 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో త్వరలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకవస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ చైర్మన్ బగాది నారాయణమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, సర్పంచ్ వి.విజయలక్ష్మి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గుమ్మడి రాంబాబు, పార్టీ నాయకులు మామిడి శ్రీనివాసరావు, ఏగు రాజారావు, తొత్తడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు గడపగడపలో సంతోషం

సారవకోట: అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు.మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచ్ పంచిరెడ్డి పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పంచిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

సీఎం జగన్‌తోనే జిల్లా అభివృద్ధి

శ్రీకాకుళం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేసింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కృష్ణదాస్ అన్నారు. ఈ నెల 19న సంతబొమ్మాళి మండలం మూలపేటలో భావనపాడు పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని, దీంతో జిల్లా ముఖచిత్రం మారుతుందన్నారు. వంశధార నదిపై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేస్తారన్నారు. ఇప్పటికే ఉద్దానానికి తాగునీరు, కిడ్నీ డయాలసిస్ సెంటర్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, కోరుకొండ శంకరరావు, గద్దిబోయిన గోవిందరావు, చల్లా తాతయ్య, సచివాలయాల మండల కన్వీనర్ నక్క తులసీదాస్, పార్టీ నాయకులు గెల్లంకి వెంకటరావు, కాళ్ల సింహాచలం, గొర్లె ఢిల్లీరావు, రొక్కం శ్రీనివాసరావు, రావాడ శ్రీనివాసరావు, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, ఏపీఎం గోవిందరాజులు, ఏపీఓ సత్యమూర్తి తదితరులున్నారు.



సారవకోట: కిన్నెరవాడలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

20 నుంచి సమ్మేటివ్-2 పరీక్షలు



ఎమ్మార్సీ భవనంలో ప్రశ్నపత్రాలను సర్దుబాటు చేస్తున్న సీఆర్పీలు

హిరమండలం: ఈ నెల 20 నుంచి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు. పరీక్షల నిర్వహణపై సీఆర్పీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించాల్సిన పరీక్షలు.. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు మార్పుచేయడం జరిగిందన్నారు. 1–8 తరగతి వరకు ఓఎంఆర్ ఆధారిత పరీక్షలు ఉంటాయన్నారు. పదో తరగతి పరీక్షల విధానాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రశ్నపత్రాలపై అవగాహన కల్పించడానికి 9వ తరగతికి ఆరు సబ్జెక్టులు 100 మార్కులకు రూపొందించారు. ఉపాధ్యాయులు 80 మార్కులకు సరాసరి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు హెచ్ఎంలు, సీఆర్పీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ సీట్లును క్లస్టర్ వారిగా సర్దుబాటు చేశారు. సీఆర్పీలు ధనుంజయరావు, గోవిందరావు, చంద్రరావు, శ్రీదేవి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవే పరమార్థం



ఆమదాలవలస రూరల్: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ కృష్ణ

సరుబుజ్జిలి: ప్రజలకు అవసరమైన సమయంలో సహకారం అందించి వారిని ఆదుకోవాలని షళంత్రి పంచాయతీ బురిడివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అదపాక గౌరినాయుడు అన్నారు. బురిడివలస జంక్షన్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ బత్తిని వరలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆమదాలవలస రూరల్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రద్దీ జంక్షన్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు ఎంతో అవసరమని ఎస్ఐ వై.కృష్ణ తెలిపారు. పట్టణంలో పూజారిపేటలో పోస్టాఫీసుకు ఎదురుగా నేతాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతను అభినందించారు. దాతలు ముందుకు వచ్చి ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమాజంలో సేవా గుణం ఎంతో గొప్పదని, అటువంటి వాటిపై యువత దృష్టి సారిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. యూత్ సభ్యులు చిన్ను, సతీష్, యశ్వంత్, హరీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

నరసన్నపేట: స్థానిక సంతలో టీటీడీకి చెందిన వేంకట అన్నమాచార్య సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం సర్పంచ్ బూరల్లి శంకర్, ఎంపీటీసీ డేవిడ్ సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు మజ్జిగను పంచారు. సేవా ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ వారణాశి సంతోషి, కోలాట బృందం సభ్యులు పాల్గొన్నారు. స్థానిక సబ్‌రిజిస్టర్ కార్యాలయం వద్ద మార్పు ఈశ్వరమ్మ, ఈశ్వరయ్యల జ్ఞాపకార్థం వారి కుమారుడు మార్పు విజయ్, స్నేహితులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రంలో నిత్యం మజ్జిగ పంపిణీ చేస్తామని విజయ్ తెలిపారు.



నరసన్నపేట: సంత వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, ట్రస్టు సభ్యులు



సరుబుజ్జిలి: బురిడివలస జంక్షన్లో మజ్జిగ పంపిణీ చేస్తున్న గౌరినాయుడు

సర్వేపల్లి ఆదర్శప్రాయుడు



కొత్తూరు: పారాపురంలో సర్వేపల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం: సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

కొత్తూరు: భారత దేశం మొదటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ నేటి సమాజానికి ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని పారాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఎమ్మెల్యే సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తికే సర్వేపల్లి వన్నె తెచ్చారన్నారు. దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. విగ్రహాన్ని తల్లిదండ్రులు పేరున ఏర్పాటు చేసిన పారాపురం గ్రామానికి చెందిన చందవ రవికుమార్‌కు ఎమ్మెల్యే తోపాటు పలువురు అభినందించారు. సర్పంచ్ కుంచాల రత్నాలు, జెడ్పీటీసీ కామక భాగ్యవతి, ఎంపీటీసీ వనము లక్ష్మీనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నందకుమార్, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కుంచాల నూకరాజు, లోతుగెడ్డ తిరుపతిరావు, తోట కిరణ్ కుమార్, గోగుల వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: స్థానిక ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలో ఉన్న మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు బంధన శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్వేపల్లి ఉపాధ్యాయుడిగా, రాష్ట్రపతిగా దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు డోకిపర్తి షణ్ముఖరావు వర్ధంతిని నిర్వహించారు. ఎస్.రామరాజు, ఎస్.షణ్ముఖరావు, ఉపాధ్యాయులు బి.రవి, కె.చిన్నబాబు, పార్వతమ్మ, కవిశ్వరరావు, తిరుపతిరావు, సవరయ్య, సత్యనారయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ఆమదాలవలస రూరల్: పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 19వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ శిక్షణకు హాజరుకావాల్సిన విద్యార్థులు ఈ నెల 18 నుంచి కళాశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి ఉత్తీర్ణత పొందిన, పరీక్షలు రాసిన విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు. శిక్షణ తరగతుల అనంతరం చివరిగా పాలిసెట్ 2023 నమూనా పరీక్ష నిర్వహిస్తామన్నారు.

రూ 1.13 లక్షలకు వేలం ఖరారు

సారవకోట: మండలంలోని అవలింగి మార్కెట్ వేలం పాటను రూ.1,13,500లకు గుమ్మడి లక్ష్మీనారాయణ దక్కించుకున్నట్లు ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా సోమవారం తెలిపారు. వేలం పాటలో పంచాయతీ కార్యదర్శి హిమబిందు, మాజీ సర్పంచ్ కింజరాపు ధర్మారావు పాల్గొన్నారు.

రోడ్డుపైకి పశువులను విడిచిపెట్టొద్దు

పాతపట్నం: పాతపట్నంలోని జాతీయ రహదారిపైకి పశువులు విడిచిపెడితే, దగ్గరలో ఉండే గోశాలకు పంపిస్తామని ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జాతీయ రహదారి పాతపట్నం మీదుగా ఉందని, ప్రతి రోజు పశువులను రహదారిపై వడిచిపెడుతున్నారని, అందువల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

మోనింగువారి చెరువును నీటితో నింపాలి

హిరమండలం: మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న మోనింగువారి చెరువును అభివృద్ధి పరిచి మంచినీటితో నింపాలని మండల బీజేపీ అధ్యక్షుడు బి.ధర్మరాజు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఈ చెరువు నీటిని వినియోగించుకునేవారన్నారు. ప్రస్తుతం ఈ చెవురు నీటిని వినియోగించే పరిస్థితి లేదన్నారు. అధికారులు స్పందించి చెరువును బాగుచేయాలని కోరారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రహదారి ప్రారంభం



రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో ఇటీవల రూ.10 లక్షల నిధులతో నిర్మించిన రోడ్డును నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం ప్రారంభించారు. ఈ గ్రామంలో ఈ నెలాఖరు నుంచి మాను పండుగలు జరగనున్న నేపథ్యంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. దీంట్లో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్డు నిర్మించారు. సర్పంచ్ పంచిరెడ్డి పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పార్టీ నాయకులు సూర్యనారాయణ, నక్క తులసీదాస్, నిక్కు కృష్ణారావు, పొన్నాన హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.